క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వ్యాధుల గుర్తింపు సర్వే


పోలకల్‌లో ఎన్‌సీడీ, సీడీ సర్వేలను చేస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఎన్‌సీడీ, సీడీ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి రెగ్యులర్‌గా మందులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

సి.బెళగల్: కార్పొరేషన్ల ద్వారా బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు దారులకు మంగళవారం ఎంపీడీఓ రాణెమ్మ తన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 50 బీసీ కార్పొరేషన్, 3 ఈబీసీ, 4 కాపు కార్పొరేషన్లకు కలిపి మొత్తం 57 యూనిట్లు మంజూరవగా 622 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. వారిని బ్యాంక్‌ల అధికారులు ఇంటర్వ్యూ చేశారన్నారు.

ట్రాక్టర్ల సీజ్


ఎర్రమట్టి తరలిస్తూ పట్టుబడ్డ ట్రాక్టర్లు, జేసీబీ

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎర్రమట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ మంగళవారం తెలిపారు. అనుమతుల్లేకుండా ఎవ్వరైనా వ్యక్తులు ఎర్రమట్టి, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని సీఐ హెచ్చరికలు జారీ చేశారు.

హమాలీల వినూత్న నిరసన


గడ్డి నోట్లో పెట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

కోడుమూరు రూరల్: కూలి రేట్ల జీఓను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం గూడూరులో సివిల్ సప్లై గోదాము హమాలీలు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద గడ్డి నోట్లో పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ అధికారంలోకొచ్చి 9నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంబంధించి పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చాలీచాలని కూలీలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు రాజశేఖర్, నాగేష్, మధు, రామాంజనేయులు, దానమన్న, సురేష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం మేరీ సునీత

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు చరణ్‌సాహిత్, హర్షితలు ఎన్ఎంఎంఎస్ ఎంపికైనట్లు హెచ్‌ఎం మేరీ సునీతా తెలిపారు. మంగళవారం ఆ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. వీరికి ప్రతి ఏడాది రూ. 12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరిఫ్ , వెంకటప్రసాద్ , వెంకటశివసాయి, జిలానీబాషా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు నాగలింగేశ్వరుడు

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం
- 27న రథోత్సవం


నాగలింగేశ్వరస్వామి ఆలయం, ఎదురుగా కొలువైన నందీశ్వరుడు, (ఇన్‌సెట్) నాగలింగేశ్వరస్వామి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో వెలసిన నాగలింగేశ్వర స్వామి మహిమాన్వితుడిగా పేరుగాంచారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 26న అంకురార్పణ, అభిషేకాలు, రాత్రి కేశవ నాగలింగేశ్వర స్వామివారి కల్యాణం, ప్రభోత్సవాలు నిర్వహించనున్నారు. 27న సాయంత్రం రథోత్సవం, 28న పారువేట, మార్చి 1న వసంతోత్సవం, 2న కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వామివారి చరిత్ర

గూడూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన నాగలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతనమైనది. క్రీ.శ 973–1150 కాలంలో పూర్వమధ్యయుగ రాజవంశీకులకు చెందిన కల్యాణి చాళుక్యులు స్వామివారికి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో అష్టపరివార దేవతలైన శివుడు, సూర్యభగవానుడు, కాలభైరవుడు, మహావిష్ణువు, మహిషాసురమర్ధిని, కుమారస్వామి, సప్తమాతృకలు, వీరభద్ర స్వామి వారికి శైవ ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాలను నిర్మించారు. స్వామివారి ఆలయ బాగోగుల కోసం 9, 10వ శతాబ్దాల్లో పరిపాలించిన రాజులు రాచయ రాజు–చామరాజు, సూర్యవంశీక రాజు మాధవ వర్మ, సదాశివరాయలు చనుగొండ్లకు చెందిన 12 కులాల వారికి భూములను సైతం ఇచ్చినట్లు ఆలయం, గ్రామంలో దొరికిన శిలా శాసనాల ద్వారా తెలుస్తోంది. స్వామివారికి పూజలు చేసి వెళితే అపజయం ఉండదనేది ఇక్కడి ప్రజల నమ్మకం. స్వామి వారికి కర్నూలు జిల్లాతో పాటు, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లోనూ భక్తులున్నారు. వారు ఏటా శ్రావణ, కార్తీక, మాఘ మాసాల్లో ఆయానికి చేరుకుని స్వామివారికి పూజలు నిర్వహించి వెళ్తుంటారు.


స్వామివారి రథోత్సవం

అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేయండి


అధికారులతో కలిసి హంద్రీనదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కోడుమూరు రూరల్: హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయాలని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హంద్రీనది వెంట పర్యటించారు. అనంతరం సీఐ తబ్రేజ్, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీఓ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, ఏఈ ప్రసాద్, ఇరిగేషన్ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ హంద్రీనది నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక తరలించే ట్రాక్టర్లను సీజ్ చేయాలని ఆదేశించారు.

ఇసుక తరలింపు అనుమతులు తీసుకున్న వారు కూడా హంద్రీలో నిబంధనలకు లోబడి తాగునీటి పథకాలకు 500 మీటర్ల దూరం నుంచి ఇసుకను తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఓ అజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలి


గూడూరులో పోస్టుకార్డులను సీఎం చంద్రబాబుకు పంపి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కోడుమూరు రూరల్: ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ గూడూరు డివిజన్ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్మికులు పోస్టు కార్డులను సీఎం చంద్రబాబు పంపించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీని పక్కకు పెట్టి ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే మున్సిపల్ కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మోహన్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గుంతన్న, సూర్యశేఖర్, సువర్ణమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవి, శేఖర నాగరాజు, శివయ్య, శాంతమ్మ, వెంకటేశ్వరమ్మ, రాజు పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి


పోలకల్లో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

సి.బెళగల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ కడప జిల్లాలోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో పోలకల్ ఏపీజీబీ ఎదుట నిరసన చేపట్టారు. మోహన్ మాట్లాడుతూ ఏపీలోని ఆనలుగు గ్రామీణ బ్యాంక్‌లను విలీనం చేసి ఒకే రాష్ట్ర స్థాయి బ్యాంక్ ఏర్పాటును సీఐటీయూ స్వాగతిస్తుందన్నారు. అయితే వైఎస్సార్ కడప జిల్లాలో సొంత భవనాలలో కొనసాగుతున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని ఎక్కడికి తరలించరాదని, వెనుకబడిన రాయసీమ జిల్లాలోనే కొనసాగడం తప్పనసరి అని ఆయన అన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయ తరలింపు ఆలోన మనుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఆసీఫ్‌ఇస్మాయిల్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉలిందకొండలో లోపించిన పారిశుద్ధ్యం


రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కల్లూరు: మండలంలోని ఉలిందకొండలో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామంలోని కొత్త బస్టాండ్ వెనక రోడ్డుపై నిత్యం మురుగు నీరు నిలుస్తుంది. ఈ రోడ్డు పక్కలోనే అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్ ఉన్నాయి. రోడ్డుపై మురుగు నీరు నిలవడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పులతో మురుగు నీటిలో దోమలు, లార్వాలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సంబంధించిన అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నారు.


గడిగరేవులలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సం నిర్వహిస్తున్న దృశ్యం

భోగేశ్వరుడి ఉత్సవాలు ప్రారంభం

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన దుర్గా భోగేశ్వరుని మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉత్సవమూర్తులకు వర ప్రయాణము నిర్వహించారు. స్వామి వారికి గడిగరేవుల గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను భోగేశ్వరాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓ రామానుజన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న బ్యాంకర్లు

ఓర్వకల్లు: బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదట అధికారులు దరఖాస్తుల పరిశీలన నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) హుసేనాపురం, నన్నూరు, ఓర్వకల్లు కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియ (ఆంధ్రా బ్యాంకు), బ్యాంక్ ఆఫ్ ఇండియ (నన్నూరు) బ్రాంచీల మేనేజర్లు హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు మండలంలో 733 మంది దరఖాస్తులు సమర్పించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


గడిగరేవులలో పశువైద్యశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ,సర్పంచ్,అధికారులు

గడివేముల: గ్రామాల్లో అందిస్తున్న పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నాగముద్దమ్మ తెలిపారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.50 లక్షలతో మరమ్మతులు చేశారు. మంగళవారం ఆ పశువైద్యశాలను ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, పాణ్యం అసిస్టెంట్ డైరెక్టర్ కమలాకర్, పశువైద్యాధికారిణి డాక్టర్ పావని, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఎంపీటీసీ జక్కుల సావిత్రి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు ఉశేన్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గ దేవస్థానంలో అగ్నిప్రమాదం


పెంటాల్ కాలిపోతున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. దేవస్థానంలో భక్తులకు వంట చేసేందుకు పెంటాల్ వేశారు. ప్రతి ఏడాది శివరాత్రి పండుగ రోజున ఈ సత్రంలోనే భక్తులకు భోజనాలు వడ్డిస్తారు.ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అన్న వడ్డించేందుకు పెంటాల్ వేశారు. రాత్రి వీచిన గాలి తీవ్రతకు మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయ అధికారులు వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు విఫల యత్నం చేశారు. అప్పటికే కుర్చీలు, పెంటాల్ మొత్తం కాలిపోయింది. అయితే, ఈ ప్రమాదం పక్కనే వున్న విద్యుత్ తీగల నుంచి షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా లేక? లేక చెత్తకుండీల నుంచి నిప్పురవ్వలు ఎగిసి పడటం ద్వారా ప్రమాదం జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది.

శివరాత్రికి శివాలయాల ముస్తాబు


విద్యుత్ బల్బులతో వెలిగిపోతున్న ఈశ్వరాలయం


మల్లికార్జున స్వామి గర్భగుడిలో గట్టు మల్లప్పస్వామి

సి.బెళగల్: మండలంలో బుధవారం రాత్రి జరిగే శివ రాత్రి ఉత్సవాలకు భక్తులు శివాలయాలును ముస్తాబు చేశారు. మంగళవారం మహా శివరాత్రి సందర్భంగా శివాలయాల వద్ద జాగారణ చేయటం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి ఆలయాలలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను చేపట్టారు. బస్టాండ్ ఆవరణంలో ఈశ్వరాలయంలో బుధవారం ఆదిదంపతులు మల్లికార్జున, భ్రరాంబాదేవిల కల్యాణం, కొండ మీద వెలసిన గట్టు మల్లప్పకు పల్లకీ, నందికోలు, తమలపాకుల అలంకరణ సేవలను చేపట్టేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. గ్రామ శివారులోని అన్నప్ప స్వామి వారి గుడికి పతాక ప్రతిష్ఠలతో పాటు జాగారణ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా ఏర్పాట్లు చేపట్టారు. కొత్తకోట, కె.సింగవరం, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, కంబదహాల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల్లోని శివాలయాలలో రాత్రి జాగారణకు భక్తులు ఏర్పాట్లను చేసుకున్నారు. పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన చెన్న సోమేశ్వర స్వామి గుడిలో జాగారణ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

పంటలను కాపాడుకోండి

- ఏడీఏ సాలురెడ్డి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: మొక్కజొన్న, మినుము పంటలను కాపాడుకోవాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, సిబ్బందితో కలిసి బ్రాహ్మణదొడ్డి సమీపంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు సూచనలు చేశారు. మినుము పంటలో గూడు పురుగు లక్షణాలను గమనించి సస్యరక్షణ పద్ధతులు తెలియజేశారు. లీటరు నీటిలో రెండు మిల్లీ లీటర్ల నొవల్యూరాన్ ద్రావణం కలిపి లేదా, వేపనూనే కషాయం పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యాప్తంగా 7,471 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.1.49 కోట్ల పీఎం కిసాన్ నిధులు జమ అయ్యాయన్నారు. వారి వెంట ఏఈఓ హిమబిందు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

పాణ్యం: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధ చేసినట్లు తెలిపారు. చిన్న పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ

ఓర్వకల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను పటిష్టం పరచాలనే ఉద్దేశంతో జ్ఞానజ్యోతి కార్యక్రమం కింద 6 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. స్థానిక మోడల్ స్కూల్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి 25 వరకు ఈ కార్యక్రమం జరిగింది. ముగింం కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. అంగన్ వాడీ కార్యకర్తలు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓంకార్ యాదవ్, సీడీపీఓలు అనురాధ, త్రివేణి, జెడ్పీ హై స్కూల్ హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు: నూతన విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పిల్లలకు నేర్పించాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు సూచించారు. పిల్లల్లో నైపుణ్యాలు పెంచడానికి వివిధ రకాలైన టీచింగ్ మెటీరియల్ తయారీ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సీఆర్‌పీలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గలో ఉత్సవాలకు పటిష్ట భద్రత


కాల్వబుగ్గలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

ఓర్వకల్లు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వబుగ్గ దేవస్థానంలో పోలీసు భద్రతను కట్టుదిట్ట చేస్తున్నట్లు కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ అన్నారు. మంగళవారం తాలూకా సీఐ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కాల్వబుగ్గను ఆయన సందర్శించారు. ముందుగా స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సదుపాయం కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, బారికేడ్లు, స్నానపు ఘాట్లు, కోనేర్లను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అధికారుల విన్నపం మేరకు ఇప్పటికే 100 మంది సిబ్బందిని కేటాయించినట్లు సీఐ చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్, ఆలయ ఈఓ మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటసేని నారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.